నేటి మ్యాచ్
దక్షిణాఫ్రికా X నెదర్లాండ్స్
మ. 2.00 నుంచి
వేదిక: ధర్మశాల

జగన్ ప్యానల్‌కే మొగ్గు

మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు మద్దతు ● హెచ్‌సీఏ ఎన్నికలకు రంగం సిద్ధం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) ఎన్నికలు రసవత్తరంగా మారాయి. ఆఫీస్ బేరర్ల ఓటింగ్ శుక్రవారమే కావడంతో.. ఎన్నికల బరిలో ఉన్న నాలుగు ప్యానల్స్ తమ ప్రయత్నాలు వేగవంతం చేశాయి. బీఆర్ఎస్ మద్దతుతో పోటీలో ఉన్న జాతీయ హ్యాండ్‌బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి అర్శనపల్లి జగన్‌మోహన్‌రావు అధ్యక్ష పదవి కోసం వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు. మరోవైపు బీజేపీకి చెందిన హెచ్‌సీఏ మాజీ అధ్యక్షుడు వివేక్ వెంకటస్వామి తన ప్యానల్‌ను రేసులో నిలిపారు. దీంతో ఈ ఎన్నికల్లో ఈ రెండు ప్యానల్స్ నడుమే ప్రధానంగా పోటీ కనిపిస్తున్నది. శుక్రవారం జరుగనున్న ఎన్నికల్లో 173 మంది ఓటు హక్కు వినియోగించుకోనుండగా.. సాధారణ మెజారిటీ సాధించేందుకు 87 ఓట్లు అవసరం. హెచ్‌సీఏ ఓటర్ల జాబితాలో 48 మంది ఇనిస్టిట్యూషన్స్, 9 ఉమ్మడి జిల్లాల అసోసియేషన్లు, 15 మంది అంతర్జాతీయ క్రికెటర్లు ఉన్నారు. రాష్ట్ర మంత్రులు కేటీఆర్, హరీశ్ రావుతో పాటు ఎమ్మెల్సీ కవిత అండదండలు ఉన్న జగన్‌మోహన్ రావు ఈ ఎన్నికల్లో విజయం సాధించడం ఖాయంగానే కనిపిస్తున్నది. ఎన్నికల్లో ఇన్‌స్టిట్యూషన్స్‌తో పాటు జిల్లాల అసోసియేషన్లు ప్రభుత్వ సూచనల మేరకే ఓటు హక్కు వినియోగించుకోవడం సంప్రదాయం కాగా.. 101 క్లబ్ సెక్రటరీలలో అధిక శాతం మంది జగన్ ప్యానల్‌కు మద్దతు తెలుపుతున్నట్లు సమాచారం. మాజీ క్రికెటర్లు శివలాల్ యాదవ్, అర్షద్ అయూబ్‌తో పాటు.. పీఎల్ శ్రీనివాస్ ప్యానల్‌లు కూడా పోటీలో ఉన్నా.. ప్రధానంగా జగన్ వర్గానికి, వివేక్ ప్యానల్‌కు మధ్య పోటీ ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరోవైపు హెచ్‌సీఏ ఎన్నికల్లో తెలంగాణ హైకోర్టు మెంబర్‌షిప్‌పై సందిగ్ధత నెలకొంది. హెచ్‌సీఏ నుంచి ఆమోదం పొందిన వ్యక్తి తెలంగాణ హైకోర్టు బార్ అసోసియేషన్ (టీహెచ్‌బీఏ)లో సభ్యుడు కాదని టీహెచ్‌బీఏ ఒక ప్రకటనలో తెలిపింది.

తిలక్ మెరుపులు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: దేశవాళీ టీ20 టోర్నీ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో హైదరాబాద్ జట్టు శుభారంభం చేసింది. సోమవారం జరిగిన పోరులో తిలక్ వర్మ సారథ్యంలోని హైదరాబాద్ 9 వికెట్ల తేడాతో మేఘాలయను చిత్తు చేసింది. మొదట మేఘాలయ 20 ఓవర్లలో 6 వికెట్లకు 119 పరుగులు చేసింది. అనంతరం ఛేదనలో హైదరాబాద్ 13.2 ఓవర్లలోనే ఒక వికెట్ మాత్రమే కోల్పోయి 120 పరుగులు చేసింది. కెప్టెన్ తిలక్ (41 నాటౌట్; 3 ఫోర్లు, 2 సిక్సర్లు), తన్మయ్ (46 నాటౌట్) ఆకట్టుకున్నారు.

ఎట్టకేలకు బోణీ

ఆసిస్ తొలిగెలుపు
శ్రీలంకకు మూడో ఓటమి
వన్డే ప్రపంచకప్

ఐదుసార్లు ప్రపంచకప్ విజేత ఆస్ట్రేలియా ఈ మెగాటోర్నీలో ఎట్టకేలకు బోణీ కొట్టింది. తొలి రెండు మ్యాచ్‌ల్లో పరాజయాలు చవిచూసిన కంగారూలు.. లంకపై గెలిచి వరల్డ్‌కప్‌లో శుభారంభం చేశారు. బౌలింగ్‌లో జాంపా లంకను వణికిస్తే.. బ్యాటింగ్‌లో మార్ష్, ఇంగ్లిస్ హాఫ్‌సెంచరీలతో జట్టును విజయతీరాలకు చేర్చారు. పటిష్టమైన పునాది తర్వాత లంకేయులు చేజేతులా మ్యాచ్‌పై పట్టు కోల్పోయి హ్యాట్రిక్ పరాజయం మూటగట్టుకున్నారు.

జాంపా (4/47)

పెరేరా (78)

లక్నో: ఆస్ట్రేలియాకు ఉపశమనం! ప్రతిష్టాత్మక వన్డే వరల్డ్‌కప్‌లో రెండు పరాజయాల తర్వాత ఆ జట్టు గెలుపు రుచి చూసింది. సోమవారం జరిగిన పోరులో ఆస్ట్రేలియా 5 వికెట్ల తేడాతో శ్రీలంకను చిత్తుచేసింది. మెగాటోర్నీలో లంకకు ఇది వరుసగా మూడో పరాజయం కావడం గమనార్హం. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న శ్రీలంక 43.3 ఓవర్లలో 209 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్లు పాథుమ్ నిషాంక (61; 8 ఫోర్లు), కుషాల్ పెరేరా (78; 12 ఫోర్లు) హాఫ్ సెంచరీలతో ఆకట్టుకున్నారు. ఈ ఇద్దరి ధాటికి ఒక దశలో 125/0తో అత్యంత పటిష్ట స్థితిలో కనిపించిన లంక.. ఆ తర్వాత వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయింది. వీరిద్దరితో పాటు చరిత అసలంక (25) మాత్రమే రెండంకెల స్కోరు చేయగా.. కెప్టెన్ కుషాల్ మెండిస్ (9), సమరవిక్రమ (8), ధనంజయ డిసిల్వా (7), దునిత్ వెల్లాలాగె (2) విఫలమయ్యారు. ఆసీస్ బౌలర్లలో జాంపా 4, స్టార్క్, కమిన్స్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. వర్షం, ఈదురు గాలుల కారణంగా మ్యాచ్‌కు కాసేపు అంతరాయం కలిగింది. అనంతరం లక్ష్యఛేదనలో ఆసీస్ 35.2 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 215 పరుగులు చేసింది. మిషెల్ మార్ష్ (52; 9 ఫోర్లు), ఇంగ్లిస్ (58; 5 ఫోర్లు, ఒక సిక్సర్) అర్ధశతకాలు నమోదు చేసుకోగా.. లబుషేన్ (40), మ్యాక్స్‌వెల్ (31 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్సర్లు) రాణించారు. ఆరంభంలో మంచి బౌలింగ్‌తో ఆసీస్‌ను 24/2కు పరిమితం చేసిన లంక అదే ఒత్తిడి కొనసాగించడంలో విఫలమైంది. లంక బౌలర్లలో మధుషనక 3 వికెట్లు పడగొట్టాడు. జాంపాకు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'అవార్డు దక్కింది.

సంక్షిప్త స్కోర్లు

శ్రీలంక: 43.3 ఓవర్లలో 209 (పెరేరా 78, నిషాంక 61; జాంపా 4/47, కమిన్స్ 2/32), **ఆస్ట్రేలియా:** 35.2 ఓవర్లలో 215/5 (ఇంగ్లిస్ 58; మార్ష్ 52; మధుషనక 3/38).

డేవిడ్ భాయ్ డైవింగ్ క్యాచ్

గత మ్యాచ్‌లో ఆరు క్యాచ్‌లు వదిలేసి అపవాదు మూటగట్టుకున్న ఆస్ట్రేలియా.. ఈ మ్యాచ్‌లో ఒకరకంగా ఫీల్డింగ్‌తోనే పైచేయి సాధించింది. లంక తొలి వికెట్‌కు భారీ భాగస్వామ్యం నమోదు చేసిన అనంతరం వార్నర్ అద్భుత క్యాచ్‌తో కంగారూలకు తొలి వికెట్ అందించగా.. కాసేపటికి కుషాల్ మెండిస్ ఇచ్చిన క్లిష్టమైన క్యాచ్‌ను వార్నర్ అందుకున్న తీరు చూసి తీరాల్సిందే. దీంతో జట్టులో స్థైర్యం పెరగగా.. కమిన్స్ కూడా చక్కటి డైరెక్ట్‌త్రోతో దునిత్ వెల్లలాగేను పెవిలియన్‌కు పంపాడు.

ప్రపంచ కప్ పాయింట్ల పట్టిక

దే	ఆ	గె	ఓ	ర.రే.	పా
భారత్	3	3	0	+1.82	6
న్యూజిలాండ్	3	3	0	+1.60	6
దక్షిణాఫ్రికా	2	2	0	+2.36	4
పాకిస్థాన్	3	2	1	-0.13	4
ఇంగ్లండ్	3	1	2	-0.08	2
అఫ్గానిస్థాన్	3	1	2	-0.65	2
బంగ్లాదేశ్	3	1	2	-0.69	2
ఆస్ట్రేలియా	3	1	2	-0.73	2
శ్రీలంక	3	0	3	-1.53	0
నెదర్లాండ్స్	2	0	2	-1.80	0

నోట్: దే: దేశం, ఆ: ఆడినవి, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, ర: రన్‌రేట్, పా: పాయింట్స్

తెలంగాణకు పతకాల పంట

34వ సౌత్ జోన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్

హనుమకొండ చౌరస్తా: హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరుగుతున్న 34వ సౌత్ జోన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షి రెండో రోజు తెలంగాణ క్రీడాకారులు పతకాలతో మెరిశారు. 4X400 మీటర్ల మిక్స్‌డ్ రీలేలో మొదటి రెండు స్థానాల్లో నిలిచిన కేరళ, కర్నాటక, మూడో స్థానంలో నిలిచిన తెలంగాణ అథ్లెట్లకు ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపూరి రమేశ్, తెలంగాణ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పగిడాల వెంకటేశ్వర్ రెడ్డి పతకాలు అందించారు. బాలుర అండర్ -14ట్రయాథ్లాన్‌లో వరుణ్ స్వర్ణం, జే దీక్షిత్ రజతం, లాంగ్‌జంప్‌లో సోము మాధవి స్వర్ణ పతకాలు గెలిచారు. బాలికల అండర్ -14లో 600 మీటర్లలో ప్రణతి పసిడి, అండర్ -16

హెక్సాథ్లాన్‌లో బి.వైశాలి బంగారు పతకం, బాలుర అండర్-16లో 400 మీటర్ల పరుగులో అజారుద్దీన్ వెండి పతకం సాధించారు. ఈ టోర్నమెంట్‌లో వివిధ రాష్ట్రాలకు చెందిన 800 మంది అథ్లెట్లు 140 విభాగాల్లో పోటీపడుతున్నారు.

దక్షిణాఫ్రికా X నెదర్లాండ్స్

ధర్మశాల: అంచనాలు లేకుండా వన్డే ప్రపంచకప్‌లో అడుగుపెట్టి.. దుమ్మురేపుతున్న దక్షిణాఫ్రికా మూడో పోరుకు సిద్ధమైంది. తమ తొలి మ్యాచ్‌లో శ్రీలంకపై రికార్డు స్కోరు చేసిన సఫారీలు.. రెండో మ్యాచ్‌లో ఆస్ట్రేలియాను చిత్తు చేశారు. ఇక మంగళవారం ధర్మశాలలో నెదర్లాండ్స్‌తో ప్రొటీస్ పోటీ పడనున్నారు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ ఇలా ఏ రంగంలో చూసుకున్నా.. నెదర్లాండ్స్ కన్నా దక్షిణాఫ్రికా ఎన్నో రెట్లు ముందున్నా.. డచ్ జట్టును తక్కువ అంచనా వేసేందుకు లేదు. అసలే డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌కు అఫ్గాన్ షాకివ్వడంతో మెగాటోర్నీలో అతిపెద్ద సంచలనం నమోదు కాగా.. ఇలాంటి ప్రదర్శనే కనబర్చాలని నెదర్లాండ్స్ కూడా పరితపిస్తున్నది. డికాక్, బవుమా, డసెన్, మార్క్‌రమ్, మిల్లర్, క్లాసెన్‌తో కూడిన బ్యాటింగ్ లైనప్‌ను నిలువరించడం నెదర్లాండ్స్‌కు శక్తికి మించిన పనే.

ఒలింపిక్స్‌లో క్రికెట్

123 ఏళ్ల తర్వాత పునః ప్రవేశం

ముంబై: నాలుగేండ్లకోసారి జరిగే ప్రతిష్ఠాత్మక ఒలింపిక్స్‌లో ఎన్నో ఆటలు ఉన్నా.. ఎందరో గొప్ప క్రీడాకారులు రికార్డులు బద్ధలు కొట్టి చరిత్ర సృష్టించినా.. ప్రపంచలోనే అత్యంత ప్రేక్షకాదరణ కలిగిన క్రికెట్ లేకపోవడం మాత్రం క్రీడాభిమానులకు పెద్ద లోటు అనిపించేది. డాన్ బ్రాడ్‌మన్, సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లీ, ఏబీ డివిలియర్స్ వంటి దిగ్గజ క్రికెటర్ల బ్యాటింగ్ విన్యాసాలు.. కపిల్ దేవ్, ఇయాన్ బోథాం వంటి ఆల్‌రౌండర్ల ప్రతాపాన్ని విశ్వ వేదికపై చూడలేకపోతున్నామనే వెలితి కోట్లాదిమంది గుండెల్ని పిండేసేది. అందుకనే కాబోలూ ప్రతి ఏడాది క్రికెట్‌ను విశ్వక్రీడల్లో భాగం చేయాలనే డిమాండ్‌లు పెద్ద ఎత్తున వినిపించేవి. ఎట్టకేలకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఫ్యాన్స్ కలను సాకారం చేస్తూ.. 123 ఏండ్ల నిరీక్షణకు తెరదించుతూ అంతర్జాతీయ ఒలింపిక్స్ సంఘం క్రికెట్ ఆటను మళ్లీ విశ్వ క్రీడల్లో భాగం చేసింది. అది కూడా క్రికెట్ స్వరూపాన్నే మార్చేసిన టీ20 ఫార్మాట్‌లో నిర్వహించనుండడంతో క్రీడాభిమానులు సంతోషంతో పొంగిపోతున్నారు. ఘన చరిత్ర కలిగిన ఒలింపిక్స్‌లో తమ ఆరాధ్య ఆటగాళ్ల ప్రదర్శనను తిలకించే రోజు కోసం ఆతృతగా కోట్లాది కండ్లతో ఎదురుచూస్తున్నారు. ప్యారిస్ వేదికగా 1900 ఒలింపిక్స్‌లో తొలిసారి క్రికెట్ పోటీలు నిర్వహించారు. అప్పుడు ఇంగ్లండ్ జట్టు ఫ్రాన్స్‌ను ఓడించి స్వర్ణం పతకం సొంతం చేసుకుంది. ఆ తర్వాత ఈ మెగా ఈవెంట్‌లో క్రికెట్ పునరాగమనానికి ఏకంగా ఒక శతాబ్ద కాలం వేచి చూడాల్సి వచ్చింది. 123 ఏండ్ల తర్వాత ఒలింపిక్స్ పోటీలో క్రికెట్‌కు మళ్లీ చోటు కల్పించాలనే తీర్మానానికి సోమవారం ఐఓసీ ఆమోద ముద్ర వేసింది. ముంబైలో జరిగిన ఐఓసీ 141వ సెషన్‌లో.. 2028లో లాస్‌ఏంజెల్స్‌లో జరిగే విశ్వ క్రీడల్లో క్రికెట్‌ను భాగం చేయాలనే తీర్మానాన్ని ప్రవేశపెట్టగా.. ఇద్దరు మాత్రమే వ్యతిరేకంగా ఓటు వేశారు. దీంతో విశ్వ వేదికపై క్రికెట్ ఆట చూడాలని ఆశపడిన కోట్లాది మంది అభిమానుల నిరీక్షణ ఫలించింది. క్రికెట్‌తో పాటు బేస్‌బాల్-సాఫ్ట్‌బాల్, స్క్వాష్, లాక్రోస్సే, ఫ్లాగ్ ఫుట్‌బాల్ ఆటల ప్రవేశానికి కూడా ఐఓసీ బృందం ఆమోదం తెలిపింది.

LOS ANGELES

ఆవిరితో వైద్య పరికరాల స్టెరిలైజేషన్

స్టెరిలైజేషన్ చాంబర్‌ను అభివృద్ధి చేసిన ఐఐటీ- మద్రాస్

చెన్నై, అక్టోబర్ 16: ఐఐటీ-మద్రాస్ పరిశోధకులు అద్భుతాన్ని ఆవిష్కరించారు. మారుమూల ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహణలో ఎదురవుతున్న ఓ ప్రధాన సమస్యకు పరిష్కారాన్ని కనుగొన్నారు. వైద్య పరికరాలను స్టెరిలైజ్ (క్రిమిరహితం) చేసేందుకు ఓ ప్రత్యేక పరికరాన్ని అభివృద్ధి చేశారు. సౌర శక్తితో వాడుకొని పని చేసే ఆవిరి ఆధారిత స్టెరిలైజ్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ పరికరాన్ని ఓ చోట నుంచి మరో చోటకు తరలించే వీలు ఉండటం మరో విశేషం. ఐఐటీ-మద్రాస్‌లోని మెకానికల్ ఇంజినీరింగ్ డిపార్టుమెంట్ ప్రొఫెసర్ సత్యం సుబ్బయ్య నేతృత్వంలో ఈ పరికరాన్ని అభివృద్ధి చేశారు.

సులువుగా స్టెరిలైజేషన్...

సౌర శక్తితో పని చేసే ఈ పోర్టబుల్ పరికరం ఆవిరిని ఉత్పత్తి చేసి స్టోర్ చేసుకుంటుంది. తద్వారా శస్త్రచికిత్సలు చేసేందుకు వాడే వైద్య పరికరాలను సులువుగా స్టెరిలైజ్ చేసుకోవచ్చు. దీని వల్ల ఇన్‌ఫెక్షన్ సోకకుండా శస్త్రచికిత్సలు చేయవచ్చు. ఈనెల 14న జరిగిన మెడికల్ క్యాంపులో దీన్ని ప్రదర్శించారు. నీరు, విద్యుత్తు సౌకర్యం లేని మారుమూల ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించేటప్పుడు శస్త్రచికిత్సకు వినియోగించిన వైద్య పరికరాల స్టెరిలైజేషన్ సవాలుగా మారుతున్నది. స్టెరిలైజేషన్ సులువుగా మారితే ఎక్కువ మందికి సేవలు అందించే వీలు కలుగుతుంది.

ప్రశ్నించే గళాలపై కేంద్రం పగ!

తాజాగా ఐఐపీఎస్ డైరెక్టర్‌కు ఉద్వాసన

న్యూఢిల్లీ, అక్టోబర్ 16: తమకు నచ్చని వారిని, తమ అవినీతిని, వైఫల్యాలను బయట పెట్టిన వారిపై కేంద్ర ప్రభుత్వం పగ బడుతున్నది. వారిని బలవంతంగా ఇంటికి సాగనంపుతున్నది. ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వే, భారత్ మాల, ఆయుష్మాన్ భారత్ పథకాల్లో అవినీతిని బయటపెట్టిన కాగ్ అధికారులపై ఇటీవల మోదీ సర్కారు బదిలీ వేటు వేసిన సంగతి తెలిసిందే. అంతేగాకుండా వివిధ మంత్రిత్వశాఖలు, విభాగాల ఆడిటింగ్‌కు కీలకమైన ఫీల్డ్‌వర్క్‌ను ఆపేయాలని కాగ్ అధికారులకు మౌఖిక ఆదేశాలు జారీచేయగా.. తమకు రాతపూర్వక ఉత్తర్వులు ఇవ్వాలిస్తేనని అధికారులు తేల్చిచెప్పారు. కాగా, జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వేలో దేశంలో రక్తహీనత పెరిగిందన్న లాంటి వాస్తవాలను ప్రచురించినందుకు సస్పెన్షన్‌కు గురైన ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పాపులేషన్ సైన్సెస్(ఐఐపీఎస్) డైరెక్టర్ కే.ఎస్.జేమ్స్ బలవంతంగా రాజీనామా చేసేందుకు కేంద్రం కారణమైంది. ఆయన రాజీనామా కోసమే ఆయనపై ఉన్న సస్పెన్షన్‌ను ఇటీవల ఎత్తివేసి వెంటనే రాజీనామాను ఆమోదించింది. జేమ్స్‌కు వ్యతిరేకంగా ఫిర్యాదులు వచ్చాయని, వాటిపై నిజ నిర్ధారణ కమిటీ నియమించామని కేంద్ర ఆరోగ్య శాఖ ప్రకటించింది. అయితే ఈ కమిటీ ఇచ్చిన నివేదికను కేంద్రం బహిర్గతం చేయకపోవడం గమనార్హం.

కే.ఎస్.జేమ్స్

స్వతంత్ర గొంతులకు స్థానం లేదు

మోదీ ప్రభుత్వంలో స్వతంత్ర గొంతులకు, ప్రొఫెషనల్‌గా పనిచేసేవారికి స్థానం లేదని సోమవారం కాంగ్రెస్ విమర్శించింది. ఐఐపీఎస్ డైరెక్టర్ జేమ్స్ రాజీనామాను ఆమోదించేందుకే ఆయనపై సస్పెన్షన్ ఎత్తేశారని కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ జైరామ్ రమేశ్ దుయ్యబట్టారు. తమకు భజన చేసేవాళ్లనే కేంద్రం కోరుకుంటున్నదని విమర్శించారు.

రంగంలోకి ఐరన్‌బీమ్!

- హమాస్ యుద్ధం నేపథ్యంలో ఇజ్రాయెల్ సన్నాహాలు
- షెడ్యూల్ కంటే ముందుగానే అందుబాటులోకి
- లేజర్ కిరణాలతో శత్రువుల రాకెట్లను కూల్చే సాంకేతికత
- ఐరన్‌డోమ్ కంటే అత్యంత చౌకైన రక్షణ వ్యవస్థ

జెరూసలేం, అక్టోబర్ 16: హమాస్‌ను నామరూపాల్లేకుండా చేయాలని కంకణం కట్టుకున్న ఇజ్రాయెల్ మరో అధునాతన అస్త్రాన్ని కదన రంగంలోకి దించేందుకు సన్నాహాలు చేస్తున్నది. హమాస్ మిలిటెంట్లు ఏకకాలంలో కురిపించిన రాకెట్ల వర్షాన్ని ఐరన్‌డోమ్ తట్టుకోలేకపోవడంతో భారీ ప్రాణ నష్టాన్ని చవిచూసిన ఇజ్రాయెల్ మరో అధునాతన వ్యవస్థ ఐరన్‌బీమ్‌ను తీసుకొస్తున్నది. శత్రువుల రాకెట్లు, మోర్టార్లను ముందుగానే పసిగట్టి గాల్లోనే కూల్చివేసే ఈ వ్యవస్థను ఐరన్‌డోమ్‌తో పాటు సరిహద్దులో అతి త్వరలో మోహరించాలని ఇజ్రాయెల్ భావిస్తున్నది.

ఏమిటీ ఐరన్‌బీమ్?

ఐరన్‌డోమ్ మాదిరిగానే ఐరన్‌బీమ్ కూడా శత్రువుల రాకెట్లు, మోర్టార్లు, విమానాలు, హెలికాప్టర్లను ముందుగానే పసిగట్టి గాల్లోనే కూల్చివేసే వ్యవస్థ. అయితే శత్రువుల రాకెట్లను కూల్చేందుకు ఐరన్‌డోమ్‌లో అత్యంత ఖరీదైన ఆయుధాలను వాడుతారు. కానీ ఐరన్‌బీమ్ లేజర్ కిరణాలను వినియోగించి శత్రువులను రాకెట్లను తుత్తునియలు చేస్తుంది. ఇజ్రాయెల్‌లోని రఫేల్ అడ్వాన్స్‌డ్ డిఫెన్స్ సిస్టమ్ కంపెనీ దీన్ని అభివృద్ధి చేస్తున్నది. దీన్ని 2025లో రంగంలోకి దించాలని ఇజ్రాయెల్ భావించినప్పటికీ.. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా వెంటనే బరిలోకి దించాలని ఇజ్రాయెల్ సన్నాహాలు చేస్తున్నది.

ఐరన్‌డోమ్ కంటే ఐరన్‌బీమ్ మెరుగైందా?

- ఐరన్‌డోమ్‌కు ఇది ప్రత్యామ్నాయం
- ఐరన్‌డోమ్‌తో పోలిస్తే చాలా చవక.
- శత్రువుల రాకెట్లను కూల్చేందుకు ఐరన్‌డోమ్‌లో వాడే ఒక్కో ఆయుధం ఖరీదు 60 వేల డాలర్లు (రూ.48 లక్షలు). దీంతో పోలిస్తే ఐరన్‌బీమ్‌లోని లేజర్ కిరణాలతో రాకెట్లను కూల్చడం చాలా చవక. దీని ఖర్చు 3.5 డాలర్లు (రూ.280).
- శత్రువుల విమానాలను పూర్తిగా లేదా పాక్షికంగా ధ్వంసం చేసే వీలు.
- ఐరన్‌బీమ్ పరిమాణంలో చాలా చిన్నది. దీన్ని ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి సులువుగా తరలించవచ్చు.

జర్నలిస్టులపై క్రూర చట్టాల ప్రయోగం

రాష్ట్రపతి జోక్యం చేసుకోవాలంటూ లేఖ

న్యూఢిల్లీ: కేంద్రంలోని బీజేపీ పాలనలో మీడియా స్వేచ్ఛ ప్రమాదంలో ఉన్నదని జర్నలిస్టు సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. జర్నలిస్టులు, ఇతర మీడియా వ్యక్తులపై యూఏపీఏ వంటి క్రూరమైన చట్టాల కింద కేసులు నమోదు చేస్తున్నారని, ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని కోరుతూ తొమ్మిది జర్నలిస్టు సంఘాలు రాష్ట్రపతి ముర్ముకు సోమవారం లేఖ రాశాయి. దేశంలో మీడియా ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటున్నదని పేర్కొన్నాయి. ఈ చట్టాల కింద అధికారులు ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, హార్డ్‌డిస్క్‌లు వంటి పరికరాలను స్వాధీనం చేసుకొనేందుకు అపరిమితమైన అధికారులు వినియోగిస్తున్నారని పేర్కొన్నాయి. భావప్రకటనా స్వేచ్ఛతో సహా రాజ్యాంగంలోని అన్ని రకాల స్వేచ్ఛలను పరిరక్షించేందుకు జోక్యం చేసుకోవాలని జర్నలిస్టు సంఘాలు రాష్ట్రపతిని కోరాయి. ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా, ప్రెస్ అసోసియేషన్, డిజిపబ్, ఢిల్లీ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్, ఏఐఎల్‌యూ తదితర సంఘాలు ఈ లేఖ రాశాయి. ఇటీవల ఆన్‌లైన్ న్యూస్ పోర్టల్ న్యూస్‌క్లిక్ కార్యాలయం, జర్నలిస్టుల ఇండ్లలో ఢిల్లీ పోలీసులు సోదాలు నిర్వహించిన విషయం తెలిసిందే.

దవాఖానల్లో హాహాకారాలు

- నీరు, విద్యుత్తు లేక తీవ్ర ఇబ్బందులు
- ఇంక్యుబేటర్, ఆక్సిజన్ దొరక్క పాలస్తీనియన్ల అవస్థలు

జెరూసలేం: గాజాపై ఇజ్రాయెల్ విధించిన దిగ్బంధంతో పాలస్తీనా వాసులు హాహాకారాలు చేస్తున్నారు. తిండి, నీరు దొరక్క అల్లాడుతున్నారు. దవాఖానల్లో విద్యుత్తు లేకపోవడంతో అత్యవసర చికిత్సలకు అంతరాయం ఏర్పడుతున్నది. ఈజిప్ట్, గాజా సరిహద్దులోని రఫా బోర్డర్ మూసివేయడంతో సహాయం అందడం లేదు. దవాఖానలు, పాఠశాలల్లో తలదాచుకున్న శరణార్థులకు రోజుకు ఒక లీటర్ నీరు మాత్రమే వారికి అందుతున్నది.

గాజాలో 2750 మంది మృతి...

ఇప్పటివరకు 2750 మంది మృతిచెందినట్టు గాజా ఆరోగ్య శాఖ తెలిపింది. ఐస్‌క్రీమ్ ట్రక్కులే మార్చురీలుగా మారాయి. 10 లక్షల మంది ఇండ్లను వీడారు.

బందీలను విడిచిపెడితేనే...

బందీలను విడిచిపెడితేనే దిగ్బంధంపై ఆలోచిస్తామని ఇజ్రాయెల్ చెబుతున్నది. మరోవైపు హమాస్ హెడ్ యహ్యా సిన్‌వార్‌ను హతమార్చేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్టు ఇజ్రాయెల్ వర్గాలు తెలిపాయి.

హమాస్ చెరలో 199 మంది

హమాస్ చెరలో 199 మంది బందీలుగా ఉన్నారు. బందీల వివరాలను ఆయా కుటుంబాలకు తెలిపినట్టు ఇజ్రాయెల్ ఆర్మీ అధికార ప్రతినిధి డేనియల్ వెల్లడించారు. లెబనాన్ మిలిటెంట్ సంస్థ హెజ్బొల్లా ఇజ్రాయెల్‌పై మరోపారి దాడులకు దిగింది. లెబనాన్ సరిహద్దులోని పర్యవేక్షణ కెమెరాలను ధ్వంసం చేశారు. దాడుల నేపథ్యంలో సరిహద్దుల్లోని గ్రామాలను ఇజ్రాయెల్ ఖాళీ చేయిస్తున్నది.

మేం రంగంలోకి దిగుతాం

గాజా ఆక్రమణపై వెనక్కి తగ్గకపోతే రంగంలోకి దిగుతామని ఇరాన్ ఇజ్రాయెల్‌ను హెచ్చరించింది. కాగా, గాజా ఆక్రమణ అతిపెద్ద పొరపాటు కావొచ్చని అమెరికా అధ్యక్షుడు బైడెన్ పేర్కొన్నారు.

మమ్మల్ని పరీక్షించొద్దు: నెతన్యాహూ

హమాస్‌కు మద్దతుగా తమపై దాడులకు దిగుతున్న ఇరాన్, హిజ్బొల్లాకు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ గట్టి హెచ్చరికలు చేశారు. తమ సహనాన్ని పరీక్షించొద్దని స్పష్టంచేశారు.

నిఠారీ కేసులో మరణశిక్ష పడ్డ ఇద్దరూ నిర్దోషులే

ప్రయాగ్‌రాజ్: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నిఠారీ వరుస హత్యల కేసులో సర్వోన్నత న్యాయస్థానం కీలక తీర్పు వెలువరించింది. ఈ కేసులో దోషులుగా తేలి మరణశిక్ష ఎదుర్కొనబోతున్న సురేంద్ర కోలీ, మోనిందర్ సింగ్ పంధేర్‌ను నిర్దోషులుగా ప్రకటించింది. వారికి వ్యతిరేకంగా సరైన సాక్ష్యాధారాలు లేనందునే ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది. ఉత్తరప్రదేశ్‌లోని నోయిడా సమీపంలో ఉన్న నిఠారీలో వ్యాపారవేత్త మోనిందర్ సింగ్ పంధేర్ ఇంటి వెనుక 2006లో ఎనిమిది మంది బాలల అస్థిపంజరాలు కనిపించాయి. దీంతో ఆయనతోపాటు ఆయన వద్ద పని చేస్తున్న సురేందర్ కోలీపై కేసు నమోదైంది. ఆ తర్వాత ఇదే ప్రాంతంలో మరికొందరు చిన్నారుల అస్థిపంజరాలు కనిపించాయి. నిందితులిద్దరిపైనా సీబీఐ 19 కేసులను నమోదు చేసింది. సాక్ష్యాధారాలు లేవని మూడు కేసుల్లో క్లోజర్ రిపోర్టులను దాఖలు చేసింది. వీరిద్దరూ దోషులని ఘజియాబాద్‌లోని సీబీఐ కోర్టు తీర్పు చెప్పి, ఇరువురికీ మరణ శిక్ష విధించింది. దీనిపై వీరిద్దరూ అలహాబాద్ హైకోర్టులో అపీలు చేశారు. వీరికి వ్యతిరేకంగా సాక్ష్యాధారాలు లేవని, వీరు నిర్దోషులని హైకోర్టు సోమవారం తీర్పు చెప్పింది.

చెప్పుల దండతో మహిళ ఊరేగింపు

- కర్ణాటకలో దారుణం

బెళగావి: కర్ణాటకలోని బెళగావి జిల్లాలో ఓ మహ